


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

| RNI APTEL 2013/54510 |


ఈనెల అక్టోబర్ 31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం జయప్రదం చేయండి.





Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 284 పేజీలు - 08 వెల - 05/- శనివారం 10-10-2026


# రైతులకు భూమి భరోసా

- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి





రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. “మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం” అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకండ్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు.

మిగతా 2లో



## భారత యువతను అడ్డుకోలేరు!

● భారత యువతను ఎవరూ అడ్డుకోలేరన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ ● ఢిల్లీలో సీజేపీ నిరసన నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై కఠిన ఆంక్షలు ● రాజధానిలో 23,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ● మెట్రో సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశం

రైళ్లను రద్దు చేయడం ద్వారానో, రవాణా మార్గాలను నిలిపివేయడం ద్వారానో దేశ యువతను ఎవరూ ఆపలేరని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు.

మిగతాది 2లో

## ఉప ఎన్నికలో అశోక్ ఆనంద్ జయకేతనం!

● తట్టాంచావడి స్థానాన్ని నిలబెట్టుకున్న అధికార ఏఐఎన్ఆర్‌సీ ● అశోక్ ఆనంద్‌కు 8,482 ఓట్ల మెజారిటీ ● కాంగ్రెస్ అభ్యర్థికి 4,876 ఓట్లు, డీఎంకే అభ్యర్థికి 2,664 ఓట్లు ● సీఎం రంగస్వామి రాజీనామాతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యం ● ఏఐఎన్ఆర్‌సీకి బీజేపీ, అన్నాడీఎంకే మద్దతు, కాంగ్రెస్‌కు టీవీకే మద్దతు



2

## ఉప ఎన్నికల్లో విజయ్ పార్టీ హవా!

● మదురాంతకంలో మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం ● ధరాపురంలో 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచిన సత్యభామ ● అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో అనివార్యమైన ఉపఎన్నికలు ● 4 నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతల అభివర్ణన ● ఈ విజయాలతో విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా ఊరట



2

## రాష్ట్రపతిని కలిసిన ఇండియా కూటమి నేతలు.. ఎవరెవరు ఏమన్నారంటే..!

● “ఓట్ల దొంగతనం”పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన విపక్షాలు ● ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి కోరినట్లు వెల్లడించిన రాహుల్ ● ప్రధాని, హోంమంత్రి, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపణ ● సీఈసీ రాజీనామా చేయాలని, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరపాలని డిమాండ్ ● సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన విపక్ష కూటమి



దేశంలో “ఓట్ల దొంగతనం” (జశీవ ఎష్ట్రశీతీఱ) జరుగుతోందంటూ తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమను కోరినట్లు లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ చుట్టూ అలుముకున్న వివాదంపై శుక్రవారం ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతిని కలిసిన అనంతరం ఆయన

మిగతాది 2లో

2



## తన పార్టీలోకి

**సహచరుడిని ఆహ్వానించిన విజయసాయిరెడ్డి**

● కొత్త పార్టీ ఏర్పాటుకు ముందు తిరుమల శ్రీవారి దర్శనం ● తనతో కలిసి రావాలని ఓవి రమణకు బహిరంగ ఆహ్వానం ● గతంలో టీటీడీ బోర్డులో కలిసి పనిచేశామని వెల్లడి

మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తన నూతన రాజకీయ పార్టీ ఏర్పాటు పనులను వేగవంతం చేశారు. త్వరలో ప్రారంభించనున్న పార్టీలోకి తన మిత్రుడు,

## 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి..

**సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్**

- సర్ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయన్న కేటీఆర్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించారని ఆరోపణ
- సీఈసీకి వ్యతిరేకంగా రేపు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన




ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు.

మిగతాది 2లో

## బీసీ రిజర్వేషన్లకు సుప్రీంకోర్టులో బ్రేక్!

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిరాకరణ
- ప్రభుత్వ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- 34 శాతం రిజర్వేషన్లకు ఆగస్టులో ప్రభుత్వం ఉత్తర్వుల జారీ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ

2



ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నానికి సుప్రీంకోర్టులోనూ అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి న్యాయపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి. గతంలో ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న

## తెలంగాణ ఆడపడుచులకు సీఎం రేవంత్ బతుకమ్మ శుభాకాంక్షలు

- ప్రకృతి ఆరాధనకు, ఐక్యతకు బతుకమ్మ ప్రతీక అన్న సీఎం
- ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుందన్న ముఖ్యమంత్రి
- బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్



తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా రాష్ట్ర మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ తొమ్మిది రోజుల పూల ఉత్సవాలను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య,

మిగతాది 2లో

# బీసీ రిజర్వేషన్లకు సుప్రీంకోర్టులో బ్రేక్!



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి న్యాయస్థానాల్లో సవాళ్లు ఎదురయ్యాయి. 2020లోనూ ప్రస్తుతానికి అడ్డంకి ఏర్పడింది. ఈ రిజర్వేషన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతాయని హైకోర్టు గతంలో పేర్కొంది. ఆ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. వెనకబడిన తరగతులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్న ఉద్దేశంతో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 20న గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించి జీవో 105 జారీ చేసింది. పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆగస్టు 19న మరో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిర్ణయాలపై 34 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి రిజర్వేషన్లు సాధారణంగా 50 శాతం మించకూడదు. అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలంటే వెనుకబాటుతనంపై సమగ్ర అధ్యయనం, విశ్వసనీయ గణాంకాలు అవసరమని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టు తాజా నిర్ణయం రాష్ట్రంలో రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# రైతులకు భూమి భరోసా



రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకంద్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు.

ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## రాష్ట్రపతిని కలిసిన ఇండియా కూటమి నేతలు..

# ఎవరెవరు ఏమన్నారంటే..!

ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమను కోరినట్లు లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ చుట్టూ అలుముకున్న వివాదంపై శుక్రవారం ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతిని కలిసిన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా పలువురు విపక్ష నేతల ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో సమావేశమైంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు.

సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రాష్ట్రపతికి తెలియజేశామని చెప్పారు. "మా ఆరోపణలను నిరూపించేందుకు ఆధారాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఆమెకు సమయం ఉన్నప్పుడు తప్పకుండా ఆధారాలను సమర్పిస్తాం" అని రాహుల్ తెలిపారు. రాష్ట్రపతి తమ వాదనలను తిరస్కరించలేదని, ప్రశ్నించలేదని, సమావేశం సంతృప్తికరంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించి, ప్రధాన న్యాయమూర్తికి కూడా ఒక వినతిపత్రం అందజేస్తామని రాహుల్ ప్రకటించారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. రాష్ట్రపతి తమ వాదనలను ఓపికగా విన్నారని తెలిపారు. "ఓట్ల దొంగతనంపై మేం నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళనల గురించి రాష్ట్రపతికి వివరించాం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తీవ్రమైన తప్పిదాన్ని, ఎన్నికల కమిషన్ పనితీరుపై మా ఆందోళనలను తెలియజేశాం. ఈవీఎంలను పక్కనపెట్టి, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని మేం డిమాండ్ చేశాం" అని ఖర్గే వివరించారు.

టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. "మేం వినతిపత్రం ఇచ్చాం. దీనిపై విచారణ జరుపుతానని, వివరాలు పరిశీలిస్తానని, ఆధారాలు కావాలని ఆమె చెప్పడాన్ని మేం సానుకూల దృక్పథంతో చూస్తున్నాం. దేశ ప్రజలు ఆందోళనగా ఉన్నారు, రాజ్యాంగ పరిరక్షకురాలిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమెను కోరాం" అని అన్నారు.

ఈ ప్రతినిధి బృందంలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితా సవరణ తీరుపై విపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

# ఉప ఎన్నికల్లో విజయ్ పార్టీ హవా!

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉప ఎన్నికల్లో భారీ విజయం దక్కింది. మధురాంతకం, ధరాపురం అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన ప్రత్యర్థి డీఎంకే రెండో స్థానానికే పరిమితమైంది. ఈ ఫలితాలు విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని ఇచ్చాయి. మధురాంతకం నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 61,470 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌కు 43,916 ఓట్లు వచ్చాయి. అన్నాడీఎంకే అభ్యర్థి గణిత సంపత్ 38,770 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 27 మంది పోటీ చేయగా, 86.26 శాతం పోలింగ్ నమోదైంది.

ధరాపురంలోనూ టీవీకే అభ్యర్థి సత్యభామ విజయకేతనం ఎగురవేశారు. ఆమెకు 62,596 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి సుకన్యకు 52,400 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యభామ 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి భానుమతి 41,078 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 80.30 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. దీంతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. టీవీకే, డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు వామపక్షాలు, నామ్ తమిళర్ కట్చి కూడా పోటీలో నిలిచాయి. ఈ విజయాలు తమ ప్రభుత్వం గత నాలుగు నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతలు అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో హోరాహోరీ పోటీ నెలకొన్న నేపథ్యంలో రెండు స్థానాలనూ గెలుచుకోవడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు, రెండు చోట్లా ఓటమి పాలైన డీఎంకే, అన్నాడీఎంకే తమ ఫలితాలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఉప ఎన్నికలు రెండు స్థానాలకే పరిమితమైనా, విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి.

# ఉప ఎన్నికలో అశోక్ ఆనంద్ జయకేతనం!

(మొదటి పేజీ తరువాయి)



పుదుచ్చేరిలో అధికార 'ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్' (ఏఐఎన్ఆర్సీ) తట్టాంచావడి అసెంబ్లీ స్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి అశోక్ ఆనంద్ 8,482 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి పార్టీకి ఈ గెలుపు రాజకీయంగా కీలకంగా మారింది. అశోక్ ఆనంద్‌కు 13,358 ఓట్లు పోలవగా, కాంగ్రెస్ అభ్యర్థి ఈ. వినయగం 4,876 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. డీఎంకే అభ్యర్థి కె.సేతు సెల్వం 2,664 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రంగస్వామి తట్టాంచావడి, మంగళం రెండు స్థానాల నుంచి గెలిచారు. అయితే, ఆయన మంగళం స్థానాన్ని అట్టిపెట్టుకుని తట్టాంచావడి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇప్పుడు ఈ స్థానాన్ని మళ్లీ తన పార్టీ ఖాతాలో వేసుకోవడంతో అక్కడ రంగస్వామి పార్టీ పట్టు కొనసాగినట్లయింది. అశోక్ ఆనంద్ గతంలోనూ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈ ఎన్నికలో ఆయనకు బీజేపీ, అన్నాడీఎంకే, లక్ష్య జననాయక కచ్చి మద్దతు లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి వినయగానికి 'తమిళగ వెట్రి కళగం (టీవీకే)' మద్దతుగా నిలిచింది. దీంతో ఈ పోటీ ప్రధాన పార్టీలతో పాటు ఇతర రాజకీయ శక్తుల మద్దతు కూడిన పోరుగా మారింది.

# 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి..

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ా×= ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రేపు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

## తెలంగాణ ఆడపడుచులకు సీఎం రేవంత్ బతుకమ్మ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

కానున్న ఈ తొమ్మిది రోజుల పూల ఉత్సవాలను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య, సంప్రదాయ పాటలు, నృత్యాలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక సందేశాన్ని విడుదల చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని, ప్రకృతిని ఆరాధించే అత్యంత గొప్ప సంప్రదాయమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజించడం తెలంగాణ జీవన విధానంలో ఒక భాగమని ఆయన పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు సాగే ఈ వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సామూహిక జీవన సౌందర్యాన్ని చాటిచెబుతాయని ఆయన కొనియాడారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తమ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ పండుగ నేడు తెలంగాణ ప్రజల జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారిపోయిందని ఆయన పేర్కొన్నారు.

## తన పార్టీలోకి సహచరుడిని ఆహ్వానించిన విజయసాయిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ఏర్పాటు పనులను వేగవంతం చేశారు. త్వరలో ప్రారంభించనున్న పార్టీలోకి తన మిత్రుడు, టీటీడీ మాజీ సభ్యుడు ఓవి రమణను బహిరంగంగా ఆహ్వానించారు. ఈ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. కొత్త పార్టీ ప్రారంభించబోతున్న సందర్భంగా స్వామివారి ఆశీస్సులు తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి తెలిపారు. గతంలో తాను, ఓవి రమణ నాలుగేళ్ల పాటు టీటీడీ బోర్డు సభ్యులుగా కలిసి పనిచేశామని గుర్తుచేశారు. ఇప్పుడు తన కొత్త పార్టీలోనూ ఇద్దరం కలిసి పనిచేసి విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అసలైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, తిరుమలలో వెయ్యి కాళ్ల మండపాన్ని పునర్నిర్మించాలని విజయసాయి రెడ్డి విజ్ఞప్తి చేశారు. జీయర్ స్వామి, ఇతర పీఠాధిపతుల ఆకాంక్ష మేరకు ఈ నిర్మాణం జరగాలని కోరారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ శక్తిని ఏర్పాటు చేసేందుకు విజయసాయి రెడ్డి ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆయన కీలక నేతలను సంప్రదిస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు.

# భారత యువతను అడ్డుకోలేరు!

(మొదటి పేజీ తరువాయి)



రైళ్లను రద్దు చేయడం ద్వారానో, రవాణా మార్గాలను నిలిపివేయడం ద్వారానో దేశ యువతను ఎవరూ ఆపలేరని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై విధించిన ఆంక్షలపై ఆయన ఈ విధంగా స్పందించారు. శుక్రవారం కుండ్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్) ఏడో స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం చిరాగ్ పాశ్వాన్ విలేకరులతో మాట్లాడారు. "వీరు భారత యువత, వీరిని ఎవరూ ఆపలేరు. ఎన్ని రైళ్లను ఆపగలరు? రవాణా సౌకర్యాలను ఎంతవరకు నిలిపివేయగలరు? ఎన్ని రోడ్లను దిగ్బంధించగలరు? ప్రపంచానికే దిశానిర్దేశం చేసే సత్తా భారత యువతకు ఉంది. అటువంటి పరిస్థితుల్లో వారిని ఎవరూ అడ్డుకోలేరు" అని ఆయన వ్యాఖ్యానించారు. సీజేపీ నిరసన కారణంగా న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు శనివారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రావాల్సిన, వెళ్లాల్సిన పలు రైళ్లను భారతీయ రైల్వే రద్దు చేయడంతో పాటు మరికొన్నింటి షెడ్యూళ్లను మార్చింది. ఈ నిరసన నేపథ్యంలో రాజధానిలో 23,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించి నగరాన్ని ఒక ఇనుప కోటలా మార్చేశారు. గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా నిర్వాహకులు చట్టపరమైన ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యారని పేర్కొంటూ, ఢిల్లీ పోలీసులు ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా, 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ప్రతిపాదించారు. పోలీసుల ప్రతిపాదన మేరకు, శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణలను నిలిపివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) తొలుత ప్రకటించింది. అయితే, ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. శనివారం నాటి నిరసనను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలను పూర్తిగా నిలిపివేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన నియంత్రణలతో మెట్రో, ఇతర రైల్వే సేవలు కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని ఆదేశించింది.

## ముఖ్య కార్యకర్తలతో, నాయకులతో సమావేశం నిర్వహించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఫరూక్ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి పనులు మరియు ప్రజల సమస్యలపై



కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. నంద్యాల నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులతో సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని మంత్రి ఫరూక్ భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరింత ఉత్సాహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కీలక నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలో బ్యాలెట్ పేపర్ విధానంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు.



పల్లె వెలుగు అమరావతి . ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునేఠా స్పష్టం చేశారు. అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరుపుతామని, 5 ఫిబ్రవరి 2026 నాటి ఫొటో ఓటర్ల జాబితానే ప్రామాణికంగా తీసుకుంటామని తేల్చి చెప్పారు.

## మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను కలిసిన హోలీ క్రాస్ గర్ల్స్ హైస్కూల్ హెడ్ మిస్ట్రెస్ మంజీరా వుడ్.

-పాఠశాల సమస్యలపై మంత్రి ఫరూక్ కి వినతిపత్రం అందజేత.

-వెంటనే డీఈఓతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి ఆదేశించిన మంత్రి ఫరూక్.

-సమస్యపై తక్షణమే స్పందించినందుకు మంత్రి ఫరూక్ కి ఘన సన్మానం.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలోని హోలీ క్రాస్ గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు (హెడ్ మిస్ట్రెస్) మంజీరా వుడ్, స్థానిక మంత్రి క్యాంపు



కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం అందజేశారు.

పాఠశాల సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి ఫరూక్ వెంటనే సానుకూలంగా స్పందించారు. అక్కడికక్కడే జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)తో ఫోన్‌లో మాట్లాడి, పాఠశాల సమస్యలను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. తమ వినతిపై సత్వరమే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కు హెడ్ మిస్ట్రెస్ మంజీరా వుడ్ మరియు వారి టీం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంత్రి ఫరూక్ ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృపాకర్ పాల్గొన్నారు.

## శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్..




పాణ్యం అక్టోబర్ 9 పల్లె వెలుగు : అవినీతి రహిత సమాజ నిర్మాణానికి నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం కీలకమని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సహకారంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోబిటీ ఫర్ ప్రాస్పెరిటీ (సమగ్రతతో సమృద్ధి) ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నైతిక విలువలు, అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలను అలవర్చుకొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి డా. జె. డేవిడ్ సుకీర్తి కుమార్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ సమన్వయకర్త ఎస్. నఫీసా అఫ్రీన్ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. అవినీతి రహిత, సమృద్ధి భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని ఈ కార్యక్రమం సందేశమిచ్చింది.

## మీసేవ, ఏపీ సేవ పోర్టల్లలో నిలిపివేసిన సేవలను వెంటనే పునరుద్ధరించాలి.

మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు 'మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం' వినతి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మీసేవ, ఏపీ సేవ పోర్టల్లలో నిలిపివేసిన ప్రజా సేవలను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ 'మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం' ప్రతినిధులు నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ మీసేవ, ఏపీ సేవ పోర్టల్లలో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల రీ-ఇష్యూ, పట్టాదార్ పాస్‌బుక్ రీప్రింట్, వాటర్ టాక్స్ చెల్లింపులు మరియు సీడీఎంఏ పరిధిలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సేవలను నిలిపివేయడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సరైన సాంకేతిక పరిజ్ఞానం, స్మార్ట్‌ఫోన్లు లేని ప్రజలు అపరిచిత ఆన్‌లైన్ లింకుల బారినపడి సైబర్ మోసాలకు గురవుతున్నారని తెలిపారు. మరోవైపు రీ-ఇష్యూ సేవలు నిలిచిపోవడంతో ప్రధాన ఆదాయం కోల్పోయి, మీసేవ కేంద్రాలనే నమ్ముకున్న వేలాది నిర్వాహకుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతతో పాటు నిర్వాహకుల ఉపాధిని పరిగణనలోకి తీసుకుని, "మన మిత్ర"తో సమానంగా మీసేవ, ఏపీ సేవ పోర్టల్లలోనూ నిలిపివేసిన అన్ని సేవలను వెంటనే పునరుద్ధరించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి ఫరూక్ ని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ సానుకూల స్పందిస్తూ మీసేవ కేంద్రాల ద్వారా సామాన్య ప్రజలకు అందుతున్న సేవల ప్రాధాన్యతను, అలాగే నిర్వాహకుల ఉపాధి సమస్యను తాను అర్థం చేసుకున్నానని తెలిపారు. ప్రజలకు సైబర్ మోసాల బారిన పడకుండా రక్షణ కల్పించడంతో పాటు, వేలాది మీసేవ కుటుంబాల జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ అంశాన్ని తక్షణమే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ గార్ల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు

ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సన భాషా, జిల్లా కోఆర్డినేటర్ గడ్డం అమర్నాథ్, ప్రతినిధులు గోస్పాడు మనోహర్, భారత్ మునాఫ్, పొన్నాపురం కాలనీ మహబూబ్, రాజు, హకీం, బాబు, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గులైన్ వాసులకు టిడ్ కో గృహాలు వద్దు
## - రెండు సెంట్ల స్థలమే ఇవ్వాలని సిపిఎం భారీ ర్యాలీ, ధర్నా.

● రాబోయే స్థానిక ఎన్నికలలో లబ్ధి పొందేందుకే అరకొర గా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ప్రభుత్వం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. టిడ్కో గృహాలు వద్దు – బొగ్గు లైన్లో నివసించే ప్రతి ఒక్కరికి రెండు సెంట్ల ఇండ్ల స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సిపిఎం కార్యాలయం నుండి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, సాయిబాబా నగర్,కరెంట్ ఆఫీస్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టి అనంతరం ధర్నా చేపట్టి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ శ్రీనివాసులు కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్,సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ, కే మహమ్మద్ గౌస్, వెంకట లింగం, మౌలాలి, పట్టణ కమిటీ సభ్యులు శివ వీరితోపాటు బొగ్గు లైన్ వాసులు వందమంది మహిళలు పాల్గొనడం జరిగింది.

అనంతరం వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని బొగ్గు లైన్లో నివసించే పేద ప్రజలందరికీ కూటమి ప్రభుత్వం హామీ ప్రకారం ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలి. ఇప్పటికే నంద్యాల పట్టణాన్ని అభివృద్ధి చేయాలని ఇక్కడున్నటువంటి ప్రాంత ప్రజలంతా సహకరించాలి అని చెప్పి అర్భటంగా పనులు మొదలుపెట్టడం జరిగింది.అయితే అక్కడున్న ప్రజలంతా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలంతా ఆందోళన చేపట్టగా రెండు సెంట్లు స్థలము ఇస్తామని, ఇల్లు నిర్మించేందుకు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిధులను ఇస్తామని అదేవిధంగా విద్యుత్తు,రోడ్లు, డ్రైనేజి కాలవలు, నీరు




అన్ని రకాల మౌలిక వసతులు కల్పించినప్పుడు మీ ఇంటిని ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తామని,అప్పటిదాకా మీ ఇళ్లను పడగొట్టబోమని మంత్రి ఎన్ఎండి. ఫరూక్ , జిల్లా కలెక్టర్ చెప్పడం జరిగింది. వీరితో పాటుగా మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, హౌసింగ్ డి.ఈ, ఎలక్ట్రికల్ అధికారులంతా ఒక కమిటీగా పి జి ఆర్ ఎస్ సెంటనరీ హాల్ లో కూర్చుని బొగ్గులైన్ లో నివసించే ప్రజలందరికీ ప్రతి ఒక్కరికి రెండు సెంట్ల స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా సీసీ రోడ్లు , డ్రైనేజి కాలువలు, వీధిలైట్లు, నీరు,కరెంటు లాంటి మౌలిక సమస్యలను పరిష్కారం చేస్తామని హామీని ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మాకు టిడ్కో గృహాలు వద్దు అని ఆరోజు ప్రజలంతా చెప్పగా మీకందరికీ గృహాలను ఇవ్వబోము, ఇంటి స్థలాలే ఇస్తాము. గతంలో ఒక సెంటు ఇచ్చినవారికి వాటిని కొట్టి వేసి వాటి స్థానం లో రెండు సెంట్లు స్థలం ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలియజేయడంతో ప్రజలంతా ఆందోళనను విరమించుకోవడం జరిగింది. ఇప్పటికి అయినా బొగ్గు లైన్లో నివసించే ప్రజలందరికీ అధికారులంతా, ప్రజాప్రతినిధులు అంతా కలిసి ఇచ్చిన హామీని నెరవేర్చేంతవరకు పోరాటం తప్పదని, రెండు సంవత్సరాల కాలంలో ఇళ్ల పట్టాల పంపిణీ చేయకుండా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అరకొరగా పంపిణీ చేసి నిజమైన లబ్ధిదారులందరికీ ఇళ్ల పట్టాలని ఇవ్వకుండా మోసం చేయడం సరైనది కాదని ప్రజలందరూ ఎన్నికల స్టంట్ కూటమి ప్రభుత్వం ఉపయోగించుచున్నదని మండిపడ్డారు.బొగ్గు లైన్ నుండి ప్రజలను కదిలించాలని, ఖాళీ చేయించాలని చూస్తే బొగ్గులైన్ ప్రజల సత్తా ఏందో చూపించేందుకు సిద్ధమని అన్నారు.

## జిల్లాలో ప్రతిరోజు కొనసాగుతున్న 'స్టాప్ - వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహణ.

☛రోడ్డు ప్రమాదాల నివారణ,ప్రజల భద్రతే లక్ష్యంగా విస్తృత తనిఖీలు.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించుటకు ప్రతిరోజు జిల్లాలోని ప్రధాన రహదారులలో స్టాప్ – వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించడంతో పాటు వాహనాలు తనిఖీ చేయాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో ప్రైవేట్ వాహనాలు,ఆర్టీసి ట్రావెలింగ్ బస్సులలో ముఖ్యంగా రాత్రి పూట తిరిగే వాహనాలలో ప్రజల భద్రతను దృషిలో ఉంచుకొని రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు మరియు సరైన భద్రతా చర్యలు,జాగ్రత్తలు పాటించాలని బస్సులలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

నంద్యాల జిల్లా పోలీసులు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు జిల్లా రాత్రిపూట తిరిగే వాహనాలను ఆపి "స్టాప్ – వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

కడప మరియు నంద్యాల హైవేలో,కర్నూలు మరియు విజయవాడ వెళ్ళే హైవేలో నంద్యాల నుండి కర్నూలు ఎన్ హెచ్ 44 హైవే,కర్నూలు నుండి బెంగుళూరు వైపు వెళ్ళే వాహనాలు మరియు జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాలలో రోడ్డు



ప్రమాదాల నివారణకు వాహనాలను ఆపి "స్టాప్ – వాష్ అండ్ గో" కార్యాక్రమం నిర్వహించడం జరిగింది. అంతేకాక వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవర్ల లైసెన్సుల వంటి భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలని డ్రైవర్లకు గుర్తు చేస్తున్నారు. వాహనాలను అతి వేగంతో నడపకుండా, రాంగ్ రూట్ లో వెళ్ళకుండా, పరిమితికి మించి ప్రయాణీకులకు ఎక్కించుకునే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా పోలీసులు తెలియజేశారు.

# ఈనెల అక్టోబర్ 31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం జయప్రదం చేయండి.

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సుంకయ్య కార్మికులకు పిలుపు.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. శుక్రవారం స్థానిక కార్మిక భవన్ నందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పత్రిక సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య ఏఐటీయూసీ నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి. శ్రీనివాసులు, ఏ. ధనుంజయ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి భూమన శ్రీనివాసులు,మెడికల్ కాంటాక్ట్ రంగం జిల్లా నాయకురాలు సుశీలమ్మ, పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి,జేమ్స్,లక్ష్మీదేవి ఆటో యూనియన్ నాయకులు ఆనంద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ముంబై మహానగరం నందు లాలా లజపతిరాయ్ అధ్యక్షతన బాలగంగాధర్ తిలక్ పండిట్ నెహ్రూ అనేకమంది స్వతంత్ర సమరయోధులు ఏఐటీయూసీ ని ఏర్పాటు చేసి స్వాతంత్ర పోరాటంలో అగ్రభాగాన నిలిచి పోరాటం చేసిన చరిత్ర కలిగిన ఏకైక కార్మిక సంఘం భారత దేశంలో ఏఐటియుసి మాత్రమేనని అన్నారు.

స్వాతంత్ర పోరాటంలో పాల్గొనడమే కాక స్వాతంత్రం కన్న పూర్వం అలాగే స్వాతంత్రం వచ్చిన తర్వాత అలుపు ఎరగని పోరాటాలు చేసి 44 కార్మిక సంక్షేమ చట్టాలను సాధించింది. ఎన్నో సార్వత్రిక సమ్మెలు ఈ భారత దేశంలో ఉన్న కార్మిక




సంఘాలను ఐక్యం చేసి పాలకుల అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పైన ఎన్నో పోరాటాలు ఎన్నో విజయాలు ఆటుపోట్లు ఎదుర్కొని కార్మిక పక్షపాతిగా కార్పొరేట్ల శ్రమ దోపిడి పై ఎప్పటికప్పుడు పోరాటాలు నడిపి కార్మికులకు అండగా నిలిచింది ఏఐటియుసి. నేడు పరిపాలిస్తున్న బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా తీసుకొని వచ్చి కార్మిక హక్కుల హరిస్తున్నటువంటి సందర్భంలో కార్మిక సంఘాలను ఏకం చేసి పోరాటాలు నడుపుతున్న సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ వలన రోజుకు 12 గంటల పని విధానం తీసుకొస్తున్న పాలకులకు వ్యతిరేకంగా, సమ్మె చేసే హక్కు,వేతనం అడిగే హక్కు,యూనియన్ పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈనెల అక్టోబర్ 31న ఏఐటియుసి 107 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పోరాట దినంగా హక్కుల దినంగా పండగ వాతావరణం లో కార్మిక అడ్డాలోనా మండల నియోజకవర్గ జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ జండాలు ఆవిష్కరణ చేసి ఎర్రజెండాలు చేతబట్టి ప్రదర్శనలు,సభలు,సమావేశాలు జరపడం ద్వారా కార్మికుల ఐక్యత పోరాట ఘట్టాలను పాలకులకు వ్యతిరేకంగా హెచ్చరిక చేసే విధంగా కార్మిక బలాన్ని నిరూపించాలని ఏఐటియుసి అనుబంధ రంగాల నాయకులు కార్మికులు నంద్యాల జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా ముందస్తు దసరా సంబరాలు.

**☛సంప్రదాయ వేడుకలు.. దుర్గాదేవి పూజ, ఆయుధ పూజతో ఆధ్యాత్మిక శోభ.**

**☛సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి: ఏజీఎం అన్వార్ బాషా, జోనల్ కోఆర్డినేటర్ హరి రెడ్డి.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నారాయణ పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలను వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కర్నూలు ఏజీఎం అన్వార్ బాషా, హైస్కూల్ జోనల్ కోఆర్డినేటర్ హరి రెడ్డి హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల పూలు, మామిడి తోరణాలు, సంప్రదాయ ముగ్గులతో అందంగా అలంకరించారు. దుర్గాదేవి పూజ, ఆయుధ పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

విద్యార్థులు, ఉద్యోగులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, ఆటలు, దసరా విశిష్టతను తెలియజేసే నాటికలు అందరినీ అలరించాయి. మహిళా సిబ్బంది, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ పాటలు పాడుతూ ఆడిన ఆటలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రాంగణమంతా పండుగ సందడితో కళకళలాడింది.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరాఈ సందర్భంగా ఏజీఎం అన్వార్ బాషా మాట్లాడుతూ.. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు. మహాభారతం ప్రకారం పాండవులు అజ్ఞాతవాసం ముగిసిన అనంతరం జమ్మిచెట్టుపై దాచిన ఆయుధాలను తీసుకుని పూజించినట్లు, రామాయణంలో శ్రీరాముడు రావణాసురుడిని సంహరించి సీతాదేవిని రక్షించిన సందర్భం



విజయదశమి విజయం, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు.

హైస్కూల్ జోనల్ కోఆర్డినేటర్ హరి రెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు భారతీయ సంస్కృతి, పండుగల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని అన్నారు. కామం, క్రోధం, లోభం, మోహం, అహంకారం, ఈర్ష్య, ద్వేషం, పగ, స్వార్థం, సోమరితనం వంటి పది దుర్గుణాలను విడనాడాలనే సందేశాన్ని దసరా పండుగ అందిస్తుందని పేర్కొన్నారు.

శక్తి ఆరాధనకు ప్రతీక విజయదశమి

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ.. విజయదశమి ప్రాముఖ్యతను తెలియజేస్తుందని వివరించారు. అదేవిధంగా దుర్గాదేవి మహిషాసురుడిపై విజయం సాధించిన సందర్భంగా దేవీ నవరాత్రులు, విజయదశమి వేడుకలు నిర్వహించుకుంటామని తెలిపారు. ప్రకృతిలోని దివ్యమైన స్త్రీశక్తిని ఆరాధించే పర్వదినంగా దసరా నిలుస్తుందని చెప్పారు. విజయదశమి రోజున జమ్మిచెట్టుకు పూజలు చేసి, జమ్మి ఆకులను పరస్పరం పంచుకోవడం మన సంప్రదాయమని వివరించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

# న్యాయవాదిపై దాడి అమానుషం.. తీవ్రంగా ఖండిస్తున్నాం.

- **సీనియర్ అడ్వకేట్ మల్లికార్జున్‌కు టీడీపీ యువ నాయకుల పరామర్శ.**
- **అండగా ఉంటామని మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి భరోసా.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోనికి చెందిన సీనియర్ అడ్వకేట్ వై.ఆర్. మల్లికార్జున్‌పై జరిగిన దాడిని టీడీపీ యువ నాయకులు మారుతి నాయుడు తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులపై దాడులు జరగడం ఆందోళనకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్లికార్జున్‌కు పరామర్శ.. ధైర్యం చెప్పిన నాయకులు

ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆదోని పట్టణంలోని వై.ఆర్. మల్లికార్జున్ నివాసానికి చేరుకున్న టీడీపీ యువ నాయకులు మారుతి నాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి వెంకటేష్ చౌదరి ఆయనను పరామర్శించారు. దాడి ఘటన వివరాలను తెలుసుకుని, ఈ క్లిష్ట సమయంలో ఆదోని తెలుగుదేశం పార్టీ ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.




న్యాయవాదుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. న్యాయవాదులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి గౌరవం, భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడే ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి సంఘటనలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.




# ఇస్రో పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ..

పాణ్యం అక్టోబర్ 9 పల్లె వెలుగు : ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా నంద్యాలలోని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఇస్రో పోటీల్లో పాణ్యం పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. తొమ్మిదో తరగతి విద్యార్థి కె. సహస్ర స్పేస్ క్విజ్‌లో ద్వితీయ స్థానం సాధించగా, ఎస్. ప్రవల్లిక (పోస్టర్ ప్రజెంటేషన్), ఎం. సుదీప్తి (ఎక్స్‌టెంపోర్ స్పీచ్) కన్సొలేషన్ బహుమతులు పొందారు. విజేతలకు ఉన్నతాధికారులు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపాల్ బి. దినేష్ బాబు విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు ప్రవీణ, అమ్జద్ బాషా, ఫర్జానాలను అభినందించారు.

# ఆలయ పూజారి విధుల నుంచి తొలగింపు!

**☛నారాయణపురంలో ధర్మకర్తలు, గ్రామ పెద్దల కీలక నిర్ణయం.**

**☛ఆరోపణలపై ఎస్వి పోలీస్ స్టేషన్ ఎస్ఐకి ఫిర్యాదు.**




ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా ఆదోని మండలం నారాయణపురం గ్రామంలోని శ్రీ గర్జిలింగేశ్వర స్వామి ఆలయ పూజారి ఆగిరన్న మరియు వారి కుమారులను పూజారి విధుల నుంచి తొలగించాలని ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు తీర్మానించారు. ఈ నిర్ణయం నేటి నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. ఈ వ్యవహారంపై సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ కుమార్ కు ఫిర్యాదు చేశారు.

**కత్తితో దాడి, మహిళల పట్ల అసభ్య ప్రవర్తనపై ఆరోపణలు** గతంలో ఆగిరన్న తన సొంత తమ్ముడు గాది లింగప్పపై ఆలయంలోనే కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని ధర్మకర్తలు, గ్రామ పెద్దలు తెలిపారు. అలాగే ఆలయానికి వచ్చే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు.

ఆలయ గౌరవం కాపాడేందుకే నిర్ణయం ఆలయ పవిత్రత, భక్తుల మనోభావాలు, మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని పూజారి విధుల నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

# ఎల్లార్తి కందారమ్మ అవ్వ దేవి ఆలయ నిర్మాణానికి రూ.51 వేల విరాళం

**టీడీపీ నాయకులు ఈబిజి గోవింద్ గౌడ్, ఈబిజి రాజేంద్ర గౌడ్ ఔదార్యం**

హోళగుంద పల్లె వెలుగు అక్టోబర్ : 09 హొళగుంద మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో



శ్రీ గురు కందారమ్మ అవ్వ దేవి నూతన ఆలయ నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబిజి గోవింద్ గౌడ్, టీడీపీ యువ నాయకులు ఈబిజి రాజేంద్ర గౌడ్ కలిసి రూ.51,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు సర్దార్, మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ జడేశ, వెంకటేష్, తరణాథ్, టీ. తిమ్మయ్యతో పాటు గ్రామ ప్రజలు ఈబిజి గోవింద్ గౌడ్‌ను శాలువా, పూలహారంతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఈబిజి గోవింద్ గౌడ్ మాట్లాడుతూ.. దేవాలయాల నిర్మాణం మన ఆధ్యాత్మిక సంప్రదాయాలకు, గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శ్రీ గురు కందారమ్మ అవ్వ దేవి నూతన ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్లార్తి గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

బనగానపల్లె , అక్టోబర్ 9, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి



దేవస్థానానికి తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల్ జిల్లా, గద్వాల పట్టణానికి చెందిన పెద్ది మనోహరరావు, ఆయన సతీమణి ఈశ్వరమ్మ , వారి కుమారుడు చౌడేశ్ వర్మ, వారి కోడలు అరుణ్ దీప్తి , వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 50,000/- రూ” చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు శుక్రవారం అందచేశారు.

## పొలాల్లోకి వెళ్లి రైతుల కష్టాలు తెలుసుకున్న ఉమాపతి నాయుడు.

☛అరికల్ గ్రామంలో పంటల పరిశీలన.. వర్షాభావ పరిస్థితులపై ఆరా.



ఆదోని (పల్లె వెలుగు): రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు టీడీపీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు ఆదోని మండలం అరికల్ గ్రామంలో పర్యటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సూచనల మేరకు ఆయన గ్రామంలోని వ్యవసాయ పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. పంటల పరిస్థితిపై

రైతులతో ముఖాముఖి

గ్రామంలోని పొలాలను పరిశీలించిన ఉమాపతి నాయుడు.. ఇటీవల వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలకు నష్టం వాటిల్లిందా? రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు? ప్రస్తుతం పంటల పరిస్థితి ఎలా ఉంది? అనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి రైతుల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని, వారి పరిస్థితులను అర్థం చేసుకోవడమే పర్యటన ముఖ్య ఉద్దేశమని నాయకులు తెలిపారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుద్ధారెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ రామకృష్ణ, జిందే శంకర్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## అరెకల్ గ్రామంలో నూతన రహదారి పనులకు శ్రీకారం.

-భూమిపూజలో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం అరెకల్ గ్రామంలో నూతన రహదారి నిర్మాణ



పనులకు భూమిపూజ నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో, ఆదోని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొంకా ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

నూతన రహదారి నిర్మాణ పనుల ప్రారంభానికి పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడటం వల్ల ప్రజల రాకపోకలకు, గ్రామాభివృద్ధికి ప్రయోజనం చేకూరుతుందని నాయకులు పేర్కొన్నారు.

పాల్గొన్న టీడీపీ నాయకులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ రామకృష్ణ, బుద్ధారెడ్డి, జిందా శంకర్, రంగన్న, నాగరాజు, భీమన్న, శంకర్ రెడ్డి, శీను, చిన్న రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాఘవేంద్ర, దొడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యురాలుగా జాఫరున్నిష



బనగానపల్లె, అక్టోబర్ 9, పల్లెవెలుగు బనగానపల్లె మండలం పాతపాడు గ్రామానికి చెందిన జనసేన పార్టీ వీర మహిళ జాఫరున్నీసను జనసేన పార్టీ నంద్యాల పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యురాలుగా నియమించారు . జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు కోఆర్డినేషన్ పార్లమెంట్ కమిటీ లో భాగంగా నంద్యాల పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యురాలుగా బనగానపల్లె మండలం పాతపాడు గ్రామానికి చెందిన జనసేన పార్టీ వీర మహిళ జాఫరున్నీసను నియమించారు. ఈ సందర్భంగా జాఫరున్నీస మాట్లాడుతూ కష్టపడిన ప్రతి ఒక్కరికి జనసేన పార్టీ అవకాశం ఇస్తుందని తెలిపారు. స్థానిక సంస్థలలో కూటమి అభ్యర్థులు 100% స్ట్రైక్ రేట్ తో గెలపొందే విధంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. పార్టీ అభివృద్ధికి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా: ఛైర్మన్



మహానంది, పల్లె వెలుగు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మహానంది దేవస్థానం ఛైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నులక చందనం యేసయ్య కుమార్తె అరవింద కడుపునొప్పితో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. శుక్రవారం ఈ విషయం తెలుసుకున్న ఛైర్మన్ ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.

‘ఒక్క నెల--ఒక నియోజకవర్గం--నాలుగు పర్యటనలు’ కార్యక్రమంలో వినతుల స్వీకరణ.

పెద్దకడబూరులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.




ఆదోని (పల్లె వెలుగు): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘ఒక్క నెల--ఒక నియోజకవర్గం--నాలుగు పర్యటనలు’ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలంలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చంద్రమ్మ భవనంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

వివిధ సమస్యలపై ప్రజల అర్జీలు

పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో పాటు రెవెన్యూ, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం, గృహ వసతి, పింఛన్లు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

అర్హుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖలకు పంపించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని, అందిన అర్జీలపై బాధ్యతాయుతంగా స్పందించి నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ దేవి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బజారి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు ఏరీ? మందులు ఎక్కడ?

● ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లలో రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి. ● శంకర్ నగర్ కేంద్రాన్ని పరిశీలించిన సీపీఎం. ● సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లలో శాశ్వత వైద్యులను నియమించి, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. పట్టణ పరిధిలోని శంకర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరింది.

వైద్యులు, మందులు లేక ప్రజలకు ఇబ్బందులు

ఈ సందర్భంగా సీపీఎం పట్టణ బృందం శంకర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించింది. అనంతరం పార్టీ పట్టణ కార్యవర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న మాట్లాడుతూ.. ఆదోని పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లలో రెగ్యులర్ వైద్యులు లేకపోవడం, అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ముఖ్యంగా గర్భిణులు వైద్య సేవలు పొందేందుకు






ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర సమయాల్లో సరైన వైద్య సేవలు అందక ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వం వెంటనే స్పందించి శంకర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శాశ్వత వైద్యుడిని నియమించాలని, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను నిరంతరం సరఫరా చేయాలని సీపీఎం నాయకులు కోరారు. పట్టణంలోని మిగిలిన అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ వైద్యులు, మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిక్కప్ప, నాగరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సంజామల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

● సంజామల తహశీల్దార్ కు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎర్రబోతుల పాపిరెడ్డి చల్లా విగ్నేశ్వర్ రెడ్డి గుండం ప్రకాష్ రెడ్డి వినతి పత్రం అందజేత

బనగానపల్లె, అక్టోబర్ 9,పల్లెవెలుగు నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. సంజామల మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, రైతులకు ఉచిత పంట బీమా, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారి నేతృత్వంలో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి వైఎస్సార్సీపీ శ్రేణులతో పాటు ప్రజా సంఘాలు, సిపిఐ పార్టీ నాయకులు రైతులు భారీగా తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. సంజామల మండలంలో సాధారణ వర్షపాతం కంటే 53.4 శాతం తక్కువ నమోదు కాగా, సుమారు 75 శాతం మేర పంట నష్టం వాటిల్లిందని అధికారులే నివేదిక ఇచ్చినప్పటికీ, ఈ కూటమి ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించకపోవడం వారి చేతకానితనానికి నిదర్శనమని మండిపడ్డారు.

?రైతుల సమస్యలపై మేము ధర్నా చేస్తామని ప్రకటించగానే.. రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అధికారి ప్రకాష్ జైన్‌కు లేఖ రాశానంటూ మంత్రి గారు సోషల్ మీడియాలో హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. “చిన్న విషయానికి కూడా సోషల్ మీడియా, ఎల్లో మీడియా ద్వారా పబ్లిసిటీ చేసుకునే మీరు, అక్టోబర్ 2న లేఖ రాస్తే అక్టోబర్ 7న






వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడం ఎవరిని నమ్మించడానికో ప్రజలకు తెలుసు. ఈ జిమ్మిక్కులను ప్రజలు, రైతులు మాత్రమే కాక మీ పార్టీకార్యకర్తలు కూడా గమనిస్తున్నారు” అని ఘాటుగా విమర్శించారు. ?ప్రభుత్వంలో ఉండి మంత్రిగా చేయాల్సిన పనిని, తాము ప్రతిపక్షంలో ఉండి రైతుల తరఫున చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి రైతులపై ఉన్న ప్రేమ ఇదేనా అని ఆయన ప్రశ్నించారు.

? కూటమి ప్రభుత్వానికి వారం రోజుల గడువు:

సంజామల మండలాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించడానికి కూటమి ప్రభుత్వానికి వారం రోజులు సమయం ఇస్తున్నామని, ఆలోగా ప్రకటన చేయకపోతే వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సంజామల తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున దీక్షలు చేపడతామని కాటసాని రామిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, సిపిఐ పార్టీ నాయకులు అబ్రహం రాజశేఖర్ సూర్య నారాయణ సంజీవులు నాగాంజనేయులు చంటి కంబగిరి గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి అన్నెం శివరాం రెడ్డి కాంచన రాజశేఖర్ రెడ్డి సత్యమయ్య ఎస్సీ బాబు ప్రసాద్ రెడ్డి నాగిరెడ్డి కృష్ణారెడ్డి తులసి రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు

# ఓటు హక్కు పరిరక్షణకు 'ఛలో రాజ్‌భవన్'

**● సీఈసీ గ్యానేష్ కుమార్ రాజీనామా చేయాలి. ● అక్టోబర్ 10న విజయవాడలో కార్యక్రమం.. విద్యార్థి, యువజన సంఘాల పిలుపు.**

ఆదోని (పల్లె వెలుగు): ఓటు హక్కు పరిరక్షణ కోసం అక్టోబర్ 10న విజయవాడలో 'ఛలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తెలిపారు. ఓట్ల తొలగింపునకు కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యత వహించాలని ఆరోపిస్తూ సీఈసీ గ్యానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంగస్వామి, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు జగదీష్, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి మద్రి స్వామి, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి కుమార్ మాట్లాడారు.

దేశవ్యాప్తంగా ఓటు హక్కు పరిరక్షణ కోసం యువత, విద్యార్థులు చేపడుతున్న 'జెన్ జీ' పోరాటానికి సంపూర్ణ మద్దతుగా 'ఛలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ ఉద్యమం కేవలం ఒక అధికారి రాజీనామాకు మాత్రమే పరిమితం కాదని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలు, పౌరుల ఓటు హక్కు పరిరక్షణ కోసం చేపడుతున్న ప్రజల్లో నమ్మకం పెంచేలా చర్యలు తీసుకోవాలని




పోరాటమని పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు దక్కేలా చర్యలు తీసుకోవాలని, అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును రాజకీయ ప్రయోజనాల కోసం హరించే అధికారం ఎవరికీ లేదని అన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా, స్వయంప్రతిపత్తితో పనిచేయాల్సి ఉందని, అయితే ఎన్నికల ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు ఆరోపించారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత, పారదర్శకతపై డిమాండ్ చేశారు.

భారీగా తరలిరావాలని పిలుపు

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణలో విద్యార్థులు, నిరుద్యోగ యువత కీలక పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అక్టోబర్ 10న విజయవాడలో నిర్వహించే 'ఛలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ, సిటీ కార్యదర్శి ఆర్యన్, హారిక, ఏఐఎస్ఎఫ్ సిటీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలి

బనగానపల్లె, అక్టోబర్ 9, పల్లెవెలుగు వ్యర్థాలను సేంద్రీయ ఎరువులుగా మార్చుకొని




గ్రామపంచాయతీకి ఆదాయం తేవాలని ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవోలు సురేంద్రనాథ్ యాదవ్, తిరుమలేశ్వర రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాతపాడు గ్రామంలో వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై హరిత రాయబారులకు, గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాతపాడు గ్రామపంచాయతీలో స్వచ్ఛ పదం (రాభౌజ) షెడ్యూల్‌లో వర్మీ కంపోస్టు తయారీపై ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవోలు బి. సురేంద్రనాథ్ యాదవ్, తిరుమలేశ్వరరెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చుకోవడం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు రైతుల ఎరువుల ఖర్చును తగ్గించవచ్చని వివరించారు. వర్మీ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు, పురుగుల నిర్వహణ, తేమ నియంత్రణ, ఇంటి పరిసరాల్లోని తడి వ్యర్థాలను వేరు చేసి వాడటం, కంపోస్ట్ తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని, రసాయనిక ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చున్నారు. హరిత రాయబారులు, గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు గ్రామస్థులకు సేంద్రియ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో వర్మీ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పిడిఓ లు మురళీమోహన్, శకుంతల, మహేశ్వరయ్య ,శ్రీనివాసులు ,నాయక్,పాతపాడు మాజీ సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, సిబ్బంది, హరిత రాయబారులు పాల్గొన్నారు.

# AISF-AIYF ఆధ్వర్యంలో విప్లవ వేగుచుక్క చేగువేరా 59వ వర్ధంతి

**ప్రపంచ పోరాటాలకు చిహ్నం చేగువేరా**

పల్లెవెలుగు బేతంచెర్ల అక్టోబర్ 09:- బేతంచర్ల




పట్టణంలోని జూ× కార్యాలయంలో-ూ×ాఖీ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో చేగువేరా 59వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూ× మండల కార్యదర్శి భార్గవ్, మండల సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేష్, డి. దస్తగిరి హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియా పట్టణంలో జన్మించి, బ్యూనస్ ఎయిర్స్ యూనివర్శిటీలో మెడిసిన్ పూర్తి చేసిన చేగువేరా, లాటిన్ అమెరికా ప్రజల బతుకులు మార్చడం కోసం 1955లో మెక్సికోలో ఫిడేల్ కాస్ట్రోతో కలిసి క్యూబా విప్లవంలో డాక్టర్ గా చేరి, విప్లవ గెరిల్లా దళ నాయకుడిగా ఎదిగారన్నారు.

1959లో స్వతంత్ర క్యూబాలో పరిశ్రమల మంత్రిగా, జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా, ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన చే, పదవులన్నీ వదిలి 1965లో బొలీవియా ప్రజల విముక్తి కోసం పోరాడి, 1967 అక్టోబర్ 9న అమెరికా సామ్రాజ్యవాద కుట్రతో అమరుడయ్యారని, అయినా నేటికీ ప్రపంచ యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారని అన్నారు.యుద్ధాల వెనుక అమెరికా ఆయుధ వ్యాపారం ఉందని 1964లో ఐక్యరాజ్యసమితిలో చే చేసిన హెచ్చరిక నేటికీ వర్తిస్తుందని, అన్యాయాన్ని సహించని ప్రతి ఒక్కరూ చే మిత్రులే అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో -ూ×ాఖీ, -ూ×ఖీ నాయకులు మధు, రమేష్ రెడ్డి, గౌరీ ఉదయ్, దేవరాజు, గోపి, శేషాద్రి, రాముడు, శివ, హమీద్, సమీర్, రసూల్, జగన్, రామ్ కిషోర్, రాజేష్, వినోద్, మణితేజ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలి

మహానంది, పల్లె వెలుగు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని శక్తి టీం హెడ్



కానిస్టేబుళ్లు డిఎన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థినిలకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ..చిన్న వయసులోనే పెళ్లి చేసుకోవడం వలన కుటుంబ భారాన్ని మోసే పరిస్థితులు వస్తాయన్నారు.పోషణలో వచ్చే ఇబ్బందులు, వ్యక్తిగత జీవితంపై పడే ప్రతికూల ప్రభావాలను పిల్లలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.బాల్య వివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక, విద్యా పరమైన నష్టాలను వివరించారు. శక్తి యాప్ను ప్రతి ఒక్కరు తమ తల్లిదండ్రుల ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో రక్షణగా ఉంటుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని లింకులు ఓపెన్ చేయవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం మహిళా పోలీసులు లక్ష్మీదేవి, సునీత, పాఠశాల కరస్పాండెంట్ మధు,తదితరులు పాల్గొన్నారు.

# కడప పార్లమెంట్ నిర్వాహక దళ్‌గా శీలంశెట్టి లక్ష్మయ్య, లక్కిడి వంశీ నియామకం

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం**

పోరుమామిళ్ల, అక్టోబర్ 9( పల్లె వెలుగు )జనసేన



పార్టీ కడప పార్లమెంట్ నిర్వాహక దళ్‌గా గతంలో పోరుమామిళ్ల మండల అధ్యక్షుడిగా పనిచేసిన శీలంశెట్టి లక్ష్మయ్య, లక్కిడి వంశీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పోరుమామిళ్లలోని జనసేన పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన శీలంశెట్టి లక్ష్మయ్య, లక్కిడి వంశీలను పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

తమకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు, పార్టీ నాయకులకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటపాటి వెంకటరామ్, గంగుల సుబ్బరాయుడు, నగిరి రమణయ్య, బొల్లు వెంకటసుబ్బయ్య, రాళ్లపల్లి వెంకటనారాయణ, బాల నారాయణ, రాళ్లపల్లి బాల నారాయణ, మోహన్, బుర్ర వెంకటేశ్వర్లు, నాగేంద్ర, రాళ్లపల్లి నాగేంద్ర, చీదరి సుభాష్, ఎక్కంటే నారాయణ, ఎక్కంటే నరేష్, మన్నూరు ప్రసన్న కుమార్, రామాయణ రామ్మోహన్, రాళ్లపల్లి వెంకట సుబ్బయ్య, రాళ్లపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారు ఇళ్ల స్థలాల కు దరఖాస్తు చేసుకోండి



దొర్నిపాడు అక్టోబర్ 9 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పేద ప్రజలు అర్హులై ఉండి ఇంటి స్థలాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని తాసిల్దార్ సుభద్ర కోరారు ,శుక్రవారం స్థానిక తాసిల్ దార్ కార్యాలయం నందు వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు కావలసినవారు ఆయా గ్రామాల వీఆర్వోలకు మీ దరఖాస్తుల అందజేయాలని ఆమె తెలిపారు మండలంలోని అన్ని గ్రామాలలో ఇంటి స్థలాలదరఖాస్తుల కొరకు దండోరావేయించాలనివీఆర్వోలకుసూచించారు,ఈకార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మాధవ, విఆర్వోలుకార్యాలయసిబ్బందిపాల్గొన్నారు

# దోమల నివారణ పై చర్యలు తీసుకుంటున్నాం..సబ్ యూనిట్ ఆఫీసర్ బ్రహ్మాజీ

బద్వేల్ అక్టోబర్ 9 (పల్లె వెలుగు ):దోమల



నివారణ పై చర్యలు తీసుకుంటున్నామని సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు బద్వేలు పట్టణంలోని బోవిల్ల వారి పల్లెలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఫీవర్ లార్వా ఇంటింటి సర్వే నిర్వహించారు. నిల్వ ఉన్న నీటిని పడవేస్తే లార్వా నివారణ అయి దోమలను నివారించవచ్చునని వైద్య సిబ్బంది తెలియజేయడం జరిగింది.

ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ దోమల నివారణకై కాలువలలో అబేట్ వేయించడం, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేసి లార్వా దశలోనే దోమలు నీవరించ వచ్చాన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. దోమ తెర



వలన దోమల నివారణ అవుతుందన్నారు డెంగు, మలేరియా, చికెన్ గున్యా, తదితర వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు.వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుందని అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్ రావు వైద్య సిబ్బంది ఈశ్వరమ్మ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు జరిగే దసరా మహోత్స వాలకు రావాలని చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులకు ఆహ్వానం పలికారు. మహానంది దేవస్థానం చైర్మన్,ఈవో, శుక్రవారం వెలుగోడు మండలం వేల్పనూరు లోని ఎమ్మెల్యే స్వగృహం నందు ఎమ్మెల్యేను కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వేదపండితులు ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు పాల్గొన్నారు.

## మానసిక ఒత్తిడిని జయిస్తే సంపూర్ణ ఆరోగ్యం




బనగానపల్లె , అక్టోబర్ 9, పల్లెవెలుగు మానసిక ఒత్తిడిని జయిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని సమగ్ర శిక్ష జిల్లా కౌన్సిలర్ ఎస్ లక్ష్మీదేవి పేర్కొన్నారు .శుక్రవారం పట్టణం కొండపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆందోళన, ఒత్తిడి, బాధ కలిగినప్పుడు డాక్టర్లను సంప్రదించాలన్నారు. .విద్యార్థులు ఎదుర్కొనే ఆందోళన, ఒత్తిడి, బాధ వంటి సమస్యలను లోపలే దాచకూడదని సూచించారు. ఇలాంటి సమస్యలు ఎక్కువ కాలం కొనసాగితే వెంటనే వైద్యులను, కౌన్సిలర్లను సంప్రదించాలన్నారు. మానసిక ఆరోగ్యానికి సంబంధించి చికిత్స కోరడం అవమానం కాదని, అది ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమన్నారు. పరీక్షలు, అధ్యయన ఒత్తిడి, కుటుంబ సమస్యలు, స్నేహితులతో ఘర్షణలు వంటి కారణాలతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు. క్రమం తప్పకుండా నిద్రపోవడం, ఆటలు ఆడటం, యోగా, ధ్యానం చేయడం వంటి చర్యలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు రాంపుల్లారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ

బనగానపల్లె, అక్టోబర్ 9, పల్లెవెలుగు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో టిడిపి



నియోజకవర్గ నాయకురాలు బీసీ ఇందిరా రెడ్డి ఆదేశాల మేరకు 100 మంది గర్భిణీ మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు . శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ ఉమాదేవి, వైద్యులు పౌష్టికాహారాన్ని గర్భిణీ మహిళలకు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ బీసీ ఇందిరా రెడ్డి సహకారంతో ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణీ మహిళలకు ప్రతి నెల 9వ తేదీన పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో, శారీరక-మానసిక వికాసంతో ఎదగాలంటే గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా మహోత్సవాలకు
## హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే ఆహ్వానం

బనగానపల్లె, అక్టోబర్ 9, పల్లెవెలుగు పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరిగే దేవీ నవరాత్రి, దసరా మహోత్సవాలకు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి దసరా మహోత్సవ ఆహ్వాన పత్రికను పట్టణ ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షుడు



వీ . ఎస్ . ఎస్ సత్యనారాయణ,పట్టణ అధ్యక్షుడు బింగిమల్ల సుబ్రమణ్యం,ప్రధాన కార్యదర్శి కాసుల జంగం శెట్టి , కోశాధికారి నూకలమధుసుధన్, గాధం శెట్టి వేణుగోపాల్, శ్రీ రామ వెంకట సుబ్రమణ్యం,నూకల వెంకట సుబ్బయ్య ,నూకల విజయ్ కుమార్,,బింగిమల్ల హనుమాన్ కుమార్, జక్కా నాగరాజు, జక్కా సుబ్రమణ్యం, భరతుడు, బండారు ప్రకాశ్ బాబు, గుండా రవికుమార్, వంకధారా గోపాల్ లు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి శాలువాకప్పి మెమెంటోను అందజేశారు.

## ప్రజలు ప్రశాంతంగా జీవించాలి : ఎస్సై

మహానంది, పల్లె వెలుగు గ్రామాల్లో ప్రజలు కక్షలకు తావు లేకుండా ప్రశాంతంగా జీవించాలని మహానంది ఎస్ఐఎన్ రామ్మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం



సాయంత్రం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో గ్రామస్తులుకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలు జోలికి వెల్లవద్దు అన్నారు. శాంతి భద్రతల విషయంలో సహకరించాలని కోరారు. అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా సైబర్ నేరాలు పట్ల ప్రతి ఒకరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబం పిల్లలును బాగా చదివించుకోవాలన్నారు. బాల్యవివాహలును అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో రాజకీయ ఘర్షణలకు చోటు ఇవ్వకుండా మేలగలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహానంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరి అమ్మవారి పల్లకిసేవ



బనగానపల్లె, అక్టోబర్ 9,పల్లెవెలుగు మండలం లోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి

దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా ఆలయ సిబ్బంది, పూజారులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్

బద్వేల్ అక్టోబర్ 9 (పల్లె వెలుగు ):బద్వేల్



మండలం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజీవిని ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శివలత పాల్గొని గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు అందించారు. సంజీవిని ఆసుపత్రి మేనేజ్‌మెంట్ తరపున డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ప్రతి గర్భిణీ సురక్షిత ప్రసవం కోసం గర్భధారణ సమయంలో కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భస్థ శిశువు ఎదుగుదల, రక్తహీనత, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రక్తహీనత ఉన్న గర్భిణులకు అవసరాన్ని బట్టి ఐరన్ చికిత్స, రక్త మార్పిడి వంటి సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉంటాయని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు 108 వాహన సేవలను, అలాగే తల్లి-బిడ్డ రవాణా కోసం 102 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య మాట్లాడుతూ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం, లింగం ఆధారంగా వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని వివరించారు. బాల్యవివాహాలను అరికట్టాలని, చిన్న వయసులో వివాహం, గర్భధారణ వల్ల తల్లి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, వైద్య పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి. జనార్దన్ రావు, గ్రామ ఆరోగ్య ఏఎన్ఎంలు, విలేజ్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాల ఎంపికపై వివో ఏ, వివో, ఓబి లకు శిక్షణా కార్యక్రమం.

రుద్రవరం. పల్లె వెలుగు : మండల కేంద్రమైన






రుద్రవరం లోని రుద్రమదేవి మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఆయా గ్రామాల వివో ఏ, వివో, ఓబి లకు శుక్రవారం దొర్నిపాడు ఏపిఎం బాబు స్పెషల్ ఆఫీసర్ గా పాల్గొని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జీరో ప్రాపర్టి మిషన్ లో భాగంగా నిరుపేద కుటుంబాల ఎంపికపై శిక్షణ ఇవ్వడం జరిగిందని ఏపీఎం వసంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీరో ప్రాపర్టీ మిషన్ లో భాగంగా అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించేందుకు వివిధ రకాలైన నిబంధనలపై వారిని ఎలా గుర్తించాలి అనే అంశాలపై వివో ఏ ల శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఇందులో ముఖ్యంగా ఆకలి, పస్తుల తో అలమటిస్తున్న కుటుంబాలు, సంపాద లేని సభ్యులు మట్టి ఇళ్లలో నివసించే కుటుంబాలు, ఒక నెలకు 6000 వేల రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు, తల్లిదండ్రులు మరణించిన అనాధ పిల్లలు చదువుకోకుండా బాల కార్మికులుగా పనిచేస్తున్న కుటుంబాలు, ఈ రకంగా ఉన్న కుటుంబాలను నిరుపేదలుగా గుర్తించి వారికి సంబంధించిన నివేదికను తయారుచేసి గ్రామైక్య సంఘం లో చర్చ జరిగిన తర్వాత వీరు నిజమైన నిరుపేదలుగా గుర్తించి పంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని గ్రామ సంఘాల పేర్లను ఆమోదపరిచి వివో ఏ ల యాప్ లో అప్లోడ్ చేసే విధానాన్ని ఈరోజు శిక్షణ తరగతులలో వివో ఏ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఏపీఎం వసంత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి లు జైపాల్, అజరయ్య, హరి, రాధా రాణి, మస్తానమ్మ, వివో ఏ, వివో, ఓబిలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.

రుద్రవరం. పల్లె వెలుగు : పర్యావరణ పరిరక్షణ



అందరి బాధ్యతని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మనోరంజన్ ప్రతాప్, ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు లు అన్నారు. శుక్రవారం యుహెచ్ది కార్యక్రమంలో భాగంగా రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం (విబిజి రాంజీ)సిబ్బంది సహకారంతో 1,625 మొక్కలు నాటే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు ఎల్.వి రంగయ్య , అల్లడి శేఖర్, యువరాజు పాఠశాల కమిటీ చైర్మన్ బాలకృష్ణ వైస్ చైర్మన్ శ్రీను ఏపీవో గౌరీ బాయ్, ఈసీ సుబ్బన్న ,టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ రజినీ ఉపాధ్యాయులు ఈరన్న ,దివాకర్ హిందీ ఉపాధ్యాయులు నాగరాజు , కిరణ్ కుమార్ , జ్యోతి ప్రియ హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ వాలంటీర్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు, కాలుష్యాన్ని తగ్గించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించవచ్చని తెలిపారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించడం ద్వారా వాటిని భవిష్యత్తులో పెద్ద వృక్షాలుగా తీర్చిదిద్దాలని సూచించారు.

పాఠశాలను పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణ స్పృహతో కూడిన ఆరోగ్యకరమైన ప్రాంగణంగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ప్రకృతి ప్రేమ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ వాలంటీర్లు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## పరిమళ నగర్‌లో రూ.38 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

● శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ ● ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత: ఎమ్మెల్యే

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నియోజకవర్గ పరిధిలోని ప్రతి వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు.

కల్లూరు మండలం పరిధిలోని 47వ వార్డు పరిమళ నగర్‌లో రూ.38 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో పాటు ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్



చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ హాజరై, శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. స్థానికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, కాలనీల రూపురేఖలు మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో 49వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, 11వ క్లస్టర్ కో-కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఇమ్మానియేల్ (గిడ్డయ్య)లతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు ప్రముఖులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీజీవీ గ్రూప్ తరపున దుర్గామాత మట్టి విగ్రహాల ఏర్పాటుకు సహకారం

**☛30 మంది ఉత్సవ కమిటీ ప్రతినిధులకు టోకన్లు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్**

**☛మిగిలిన 20 మంది కూడా విగ్రహాలు ఏర్పాటు చేస్తే ఆర్థిక సహాయం**

**☛పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రోత్సాహ**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలో దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని వివిధ వీధుల్లో దుర్గామాత మట్టి విగ్రహాల ఏర్పాటుకు టీజీవీ గ్రూప్ సంస్థల తరపున సహకారం అందిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా తెలిపారు. నగరంలోని హోటల్ మౌర్య ఇన్ కాంప్లెక్స్‌లో ఉన్న తన కార్యాలయంలో 30 మంది ఉత్సవ కమిటీ ప్రతినిధులకు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన టోకన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ప్రతి సంవత్సరం దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా టీజీవీ గ్రూప్ తరఫున దుర్గామాత విగ్రహాల ఏర్పాటుకు సహకారం అందిస్తున్నామని తెలిపారు. గతంలో 50 మందికి పైగా ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సహాయం అందించేవారమని, అయితే ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో విగ్రహాల తయారీదారులు ఆశించిన స్థాయిలో విగ్రహాలను



తయారు చేయకపోవడంతో ప్రస్తుతం 30 మందికి సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. మిగిలిన 20 మంది కూడా తమ ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటు చేస్తే వారికి ఆర్థిక సహాయం అందజేస్తామని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ టీజీవీ గ్రూప్ తరపున దుర్గామాత మట్టి విగ్రహాల ఏర్పాటును ప్రోత్సహిస్తూ సహకారం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు.

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, నీటి కొరత మధ్య కర్నూలు నగరంలోని కేవస్ కెనాల్, హంద్రీనీవా కాలువల్లో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రత్యేక చొరవతో విజయవంతంగా నిర్వహించామని మంత్రి తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వరుణయాగం కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

దేవి నవరాత్రుల సందర్భంగా దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి తుంగభద్ర నదిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించినట్లు మంత్రి తెలిపారు. ఉత్సవ కమిటీలు దుర్గామాత మండపాల వద్ద దైవ సంబంధమైన పాటలు మాత్రమే ప్రసారం చేస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం తగ్గిపోయి, రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రతి ఒక్కరూ దుర్గామాతను ప్రార్థించాలని మంత్రి టీజీ భరత్ ఆకాంక్షించారు. దసరా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

# సద్గురు దత్త కృపాలయం సేవలు అభినందనీయం: మంత్రి టీజీ భరత్

**● పేదలకు, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత ● 3 వైకుంఠ రథాలు, 4 ఫ్రీజర్ బాక్సులను ప్రారంభించిన మంత్రి టీజీ భరత్**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలోని జమ్మి చెట్టు వద్ద ఉన్న సద్గురు దత్త కృపాలయంలో మంత్రి టీజీ భరత్ మూడు వైకుంఠ రథాలు, నాలుగు ఫ్రీజర్ బాక్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సద్గురు దత్త కృపాలయం ట్రస్ట్ సమాజానికి అందిస్తున్న సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కరోనా సమయంలో సద్గురు దత్త కృపాలయం అందించిన సేవలు ఎంతో గొప్పవని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి ప్రతిరోజూ సుమారు వెయ్యి మందికి ఉచితంగా భోజనం అందిస్తూ ట్రస్ట్ గొప్ప మానవత్వాన్ని చాటుకుంటోందని కొనియాడారు. పేదలకు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ నిస్వార్థ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రతి మనిషి తన జీవితంలో ఎంతో కొంత మంచి పని చేయాలని, ఇతరులకు తన వంతు సహాయం అందించాలని మంత్రి సూచించారు. సమాజంలో ఒకరికొకరు సహకరించుకుంటూ, అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచినప్పుడే మానవత్వానికి నిజమైన అర్థం ఉంటుందని తెలిపారు. సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సద్గురు దత్త కృపాలయం ట్రస్ట్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ రెడ్డి స్వామి చేస్తున్న



నిస్వార్థ సేవలను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని అన్నారు. వైకుంఠ క్షేత్ర అభివృద్ధికి తన తరపున, రాష్ట్ర ప్రభుత్వ తరపున అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. సమాజానికి ఇంత గొప్ప సేవలు అందిస్తూ, అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సద్గురు దత్త కృపాలయం ట్రస్ట్ కమిటీ సభ్యులను మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిఆర్ కమ్యూనికేషన్స్ అధినేత డి. వెంకటేశ్వర్ రెడ్డి సద్గురు దత్త కృపాలయంకు లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఈ చెక్కును జనరల్ మేనేజర్ ఎస్. కే మహేష్ సద్గురు దత్త కృపాలయం కమిటీ సభ్యులకు మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు చంద్రశేఖర్ రెడ్డి, మాతృశ్రీ కృష్ణకుమారి, అధ్యక్షుడు మల్లారెడ్డి, ఏపిఐఐసి డైరెక్టర్ జగదీష్ గుప్తా,

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, సద్గురు దత్త కృపాలయం సెక్రెటరీ శ్రీధర్ గుప్తా, అడిషనల్ సెక్రటరీ హరినాథ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు రాకేష్, నిర్మల రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శేషు యాదవ్, సుజాత, సిటీ కేబుల్ ఎస్.కె మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# క్రిష్టిపాడుగ్రామ ప్రజల సమస్యలను తీరుస్తా

-ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

దొర్నిపాడు అక్టోబర్ 9 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడుమండలంలోని కిష్టిపాడు గ్రామ ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు అన్నిటిని పరిష్కారం చేసి తీరుస్తానని ఆర్లగడం నియోజకవర్గంశాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ అన్నారు,శుక్రవారం క్రిష్టిపాడు గ్రామంలో5లక్షలతోఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి అదే విధంగా 20 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియభూమి పూజచేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో హరిజనవాడలో స్మశాన వాటిక ముళ్ల పొదలతొలగింపు, మట్టి తోలకముఅదే విధంగా హిందూ స్మశాన వాటి కు రహదారి సౌకర్యం ,బ్రిడ్జిని త్వరలోనే ఏర్పాటు చేస్తానని సభ ముఖంగా ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు, గ్రామానికి చెందినశిలారమ్అనేమహిళసచివాలయంలో విధులు నిర్వహిస్తూ వేతనాలు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో వెంటనే అధికారులను చర్యలు తీసుకోవాలని సూచించారు కిష్టిపాడుగ్రామానికి వివిధ రకాల అభివృద్ధి పనుల కొరకు 50 లక్షల రూపాయలను ఇప్పటికే హెచ్చించామని అన్నారు దొర్నిపాడు మండలానికి పల్లె పండుగ కింద మూడు విడత లలో జరిగిన అభివృద్ధి పనులకు7 కోట్ల 11 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది





అన్నారు మసీదుకు రెండు నెలల్లో కాంపౌండ్ గోడపూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు, జలజీవన్ కింద 11 లక్షల రూపాయలతో కొత్త బోర్లు మరమ్మతుల ను అధికారులుచేయిస్తారన్నారు,వచ్చే స్థానికఎన్నికల్లో కూటమి జెండా అన్ని గ్రామాల్లో ఎగురవేస్తామన్నారు, వైసీపీ నాయకులు స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడగడానికిఏ ముఖం పెట్టుకొని వస్తారో మీరే అడగాలన్నారు ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటరామిరెడ్డి ,కట్టుబడి బాషా చాంద్ బాషా ,డీలర్ జగదీశ్వర్ రెడ్డి, నాగేశ్వర్రెడ్డి ,భీమన్న ఎంపిటిసి మహబూబ్ బాషా లక్ష్మీపతి, ఓబులపతి ,మండల స్థాయి అధికారులు ఎస్సై శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు

# పాఠశాలకు సరస్వతీదేవి చిత్రపటం వితరణ..

పాణ్యం అక్టోబర్ 9 పల్లె వెలుగు : స్థానిక అయ్యప్ప రెడ్డి కాలనీలోని ఎంపీపీ పాఠశాలకు బాలాజీ జిరాక్స్ సెంటర్ యజమాని బాలాజీ శుక్రవారం శ్రీ సరస్వతీదేవి చిత్రపటాన్ని విరాళంగా అందజేశారు.తన తండ్రి కీర్తిశేషులు సుందర్ సింగ్ జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యుల సహకారంతో ప్రముఖ చిత్రకారుడు శ్రీరాములు చేత ఈ చిత్రపటాన్ని రూపొందించినట్లు బాలాజీ తెలిపారు.విద్యకు, జ్ఞానానికి ప్రతీకగా భావించే సరస్వతీదేవి చిత్రపటాన్ని పాఠశాలకు అందజేయడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఫీ, ఉపాధ్యాయులు బాలాజీకి కృతజ్ఞతలు తెలిపారు.



# VRA లు చేపడుతున్న నిరవధిక

**సమ్మె కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**

బనగానపల్లె, అక్టోబర్ 9,పల్లెవెలుగు బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండల




తహశీల్దార్ కార్యాలయానికి సంబంధించిన ఎ=రా లు చేపడుతున్న నిరవధిక సమ్మె కు తన సంపూర్ణ మద్దతు ప్రకటించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గత 24 రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక నిరహార దీక్షలు చేస్తున్న ఎ=రా ల మొర ఆలకించడానికి కూడా టైమ్ లేదా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి. రెవెన్యూ వ్యవస్థ కు పిల్లర్స్ లాంటి వారు ఎ=రా లు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఎ=రా ల డిమాండ్లను తమ.అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళతాను అని హామీ ఇచ్చిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈ కార్యక్రమం లో రాష్ట్ర వైస్సార్సీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూరప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అటవీ సంరక్షణ కొరకు మూడు కొత్త బేస్ క్యాంపులు ఏర్పాటు .

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం రేంజ్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ సంరక్షణ కొరకు మూడు కొత్త బేస్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు రేంజ్ అధికారి ముర్తుజావలి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ కొరకు ప్రభుత్వము చర్యలు చేపట్టిందని అందులో భాగంగా రుద్రవరం రేంజ్ పరిధిలో బేస్ క్యాంపులు పెంచడం జరిగిందని రేంజ్ అధికారి తెలిపారు. ఇందులో భాగంగా మేడం బావి బీట్ లో బేస్ క్యాంపు, మిట్టపల్లె బీట్ లో బేస్ క్యాంపు, పెద్ద వంగలి బీట్ లో బేస్ క్యాంపును కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ బేస్ క్యాంపులో ఒక్కొక్క బేస్ క్యాంపులో 5గురిని నియమించామని రేంజ్ అధికారి తెలిపారు. అహోబిలం, ఊట్ల, టీజీపీ కాలనీ, పెద్దవంకరబాయి ఎస్ క్యాంపులను గతంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన బేస్ క్యాంపులతో పాత వాటిని కలుపుకొని రుద్రవరం రేంజ్ పరిధిలో మొత్తం 7 బేస్ క్యాంపులు అటవీ సంరక్షణ కొరకు ఏర్పాటు చేయడం జరిగిందని రేంజ్ అధికారి తెలిపారు.



# అమ్మాయిల చదువు దేశానికి వెలుగు.

రుద్రవరం.పల్లె వెలుగు : అమ్మాయిల చదువు దేశానికి వెలుగు అని కస్తూరిబా గురుకుల




పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, నంద్యాల అధికారి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ విభాగాలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మాయిల చదువు కుటుంబానికి ఎలా ఉపయోగపడుతుంది, వారి పిల్లల భవిష్యత్తుకు ఎలా ఉపయోగపడుతుందని అనే విషయాన్ని, లింగ సమానత్వం గురించి, సమాజంలో అమ్మాయిల విద్య యొక్క ఆవశ్యకత గురించి, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి మరియు బాలికలు ప్రలోభాలకు గురికాకుండా జీవితంలో లక్ష్యాలను నేర్పరచుకొని వాటిని ఎలా సాధించుకోవాలనే దానిపై అవగాహన కలిగి ఉండాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, సిహెచ్ఎల్ సూపర్వైజర్ దస్తగిరమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ రషీదా బేగం, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పై టీడీపీ కట్టుబడి ఉంది

**● చట్టపరంగా బీసీలకు న్యాయం చేయలేకపోయినా, పార్టీ పరంగా న్యాయం చేస్తాం ● గొడ్డలి పార్టీ కోర్టులకి వెళ్లి రిజర్వేషన్లను అడ్డుకొని బీసీలకు ద్రోహం చేసింది... ఎంపీ బస్తిపాటి నాగరాజు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో బీ.సీ లకు 34శాతం రిజర్వేషన్ పై తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజెర్వేషన్లు కల్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు లో వేసిన పిటిషన్ ను కొట్టి వేయడం పై ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు.. గొడ్డలి పార్టీ నేతలు కోర్టులకు వెళ్లి రిజర్వేషన్లను అడ్డుకుని బీసీలకు తీరని ద్రోహం చేశారని ఎంపీ మండిపడ్డారు... బీసీలకు న్యాయం చేయాలన్నదే టీడీపీ లక్ష్యమని, బీసీల హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరన్నారు... చట్ట పరంగా బీసీలకు న్యాయం చేయలేకపోయినా, పార్టీ పరంగా న్యాయం చేస్తామన్న ఎంపీ నాగరాజు.. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న వైకాపా పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు తగిన బుద్ధి చెబుతారన్నారు...

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com